05ATP29_05ATP29.qxd 29-11-2025 PM 10:32 Page 1



## కాలనీలోని సమస్యలను పరిష్కరించండి



సమస్యలు పరిష్కరించాలని వివరిస్తున్న దృశ్యం

పుట్లూరు, నవంబర్ 29 ప్రభాతవార్త

పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి డి.పెద్దయ్య గ్రామ శాఖ కార్యదర్శి బాలు ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ సెక్రెటరీ, వీఆర్ఓను కాలనీలోని సమస్యలను చూపించారు. ఈ సందర్భంగా పెద్దయ్య మాట్లాడుతూ తక్కళ్లపల్లి గ్రామంలోని కాలనీలోని సమస్యలు మౌళిక వసతులు కల్పించాలని గతంలో సచివాలయం వద్ద నిరసన తెలిపినా పరిష్కరించకపోవడంతో పంచాయతీ సెక్రెటరీ, వీఆర్ఓను కాలనీలోకి పిలుచుకుపోయి అక్కడున్న మురికి నీళ్లు, కంప చెట్లు, కాలనీలో ఉన్న మురికి నీటి గుంతలు, వీధిలైట్లు, మౌళిక వసతులు ఎలా ఉన్నాయో అని చూపించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడి స్కూల్ వద్ద ఓ చిన్నపాటి కుంట తలపిస్తోందని, మురికి నీళ్ల సైడ్ కాలువ లేక తాండవిస్తున్నాయన్నారు. స్కూల్ పిల్లలు స్కూల్ టైం అంతా ఆ నీటి వద్దనే గడపాల్చి వస్తోందన్నారు. అక్కడున్న మురికి నీటి దుర్వాసన, దోమ కాటు వల్ల విష జ్వరాలు వచ్చే ప్రమాదం వుందన్నారు. తాగునీటి ట్యాంక్ కంప చెట్లతో పూర్తిగా నిండి ఆ నీటి ట్యాంకు, అక్కడున్న బోరుబాయి పూర్తి కనబడకుండా కంపచెట్ల మయమయ్యాయని, అలాగే వీధిలైట్లు ఎక్కడ చూసినా పనిచేయడం లేదని, కావున వెంటనే సైడ్ కాలవలు ఏర్పాటు చేసి కంప చెట్లు తొలగించి అంగన్‌వాడి స్కూల్ వద్ద శుభ్రంగా ఉండేటట్లు చూడాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రాజు, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు పెద్దన్న, నడిపి నారాయణ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సురేంద్ర, కె. కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## తనిఖీల భయంతో వస్త్ర దుకాణాలు మూసివేత



దుకాణాలను మూసివేసిన దృశ్యం

యాడికి, నవంబర్ 29 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలో శనివారం సేల్ టాక్స్ అధికారులు తనిఖీ నిమిత్తం వస్తున్నారని సమాచారం అందడంతో వస్త్ర దుకాణదారులు తమ తమ దుకాణాలను మూసివేశారు. అయితే తనిఖీ అధికారులు శనివారం రాకపోవడంతో దుస్తుల కొరకు, మండలంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన వినియోగదారులు దుస్తుల కొనుగోలు కోసం వెళ్లినవారు వస్త్ర దుకాణాలు మూసివేతతో తీవ్ర అసహనానికి గురయ్యారు. దుకాణదారులు తమ తమ వ్యాపారాలు సక్రమమైన పద్ధతిలో విక్రయాలు జరిపినట్లయితే ఇలా దుకాణాలు మూసే దురవస్త ఎందుకు వస్తుందని వస్త్ర కొనుగోలుదారులు బాహటంగానే మాట్లాడుకోవడం విశేషం.

## యాడికి సిఐగా శ్రీనివాసులు



యాడికి, నవంబర్ 29 ప్రభాతవార్త

యాడికి అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా శ్రీనివాసులును నియమిస్తూ అనంతపురం జిల్లా ఎస్పి జగదీష్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. యాడికి సిఐగా విధులు నిర్వహిస్తూ వీఆర్‌కు వెళ్లిన ఈరన్న స్థానంలో శ్రీనివాసులును నియమిస్తున్నట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి



పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

యల్లనూరు, నవంబర్ 29 ప్రభాతవార్త

యల్లనూరు మండలం జంగంపల్లి గ్రామంలో సాగులో వున్న పప్పుశనగ పొలాలను శనివారం మండల వ్యవసాయాధికారి బి.కిరణ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఇందులో భాగంగా పప్పుశనగ పంటకు సోకిన తెగుళ్లను పరిశీలించారు. ముఖ్యంగా ఆకుమాడు తెగులను గమనించారు. ఈ తెగులు ఆశించిన పొలంలో అక్కడక్కడ పూర్తిగా ఎండిపోయిన మొక్కలు మరియు పాక్షికంగా ఎండిపోయిన కొమ్మలు కనిపిస్తాయన్నారు. కొమ్మలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కొనభాగం నుండి కింది వరకు ఎండిపోతుందన్నారు. ఈ తెగులు విత్తనము మరియు నేల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. అకాల వర్షాలు కురిసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరాకి హెక్సా కొనజోల్ 400 మిల్లీలీటర్లు లేదా ప్రాపికొనజోల్ 200 మిల్లీలీటర్లు లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు చొప్పున పిచికారి చేయడం ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. అదేవిధంగా ఎండు తెగులు ఉన్నటువంటి ప్రాంతాల్లో మొక్కల మొదలు తడిసే విధంగా కార్బండెజెమ్ 12 శాతం + మంకోజెబ్ 63 శాతం మందును 200 గ్రాములు ఒక ఎకరాకు కలిపి స్ప్రే చేయాలని వ్యవసాయాధికారి రైతులకు సూచించారు.

## శ్రీరంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు

తాడిపత్రిరూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త



తాడిపత్రి మండలం ఆలూరుకోన వెసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామికి శనివారం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, ఆకుపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు ఆలూరుకోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ ఒగేటి రంగనాయకులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలను సందర్శించిన కందికుంట

గాండ్లపెంట ప్రభాతవార్త నవంబర్ 29

మండల పరిధిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించిన శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ ఆహారము ఎలా ఉందని అలాగే ఉపాధ్యాయులు చదువును బాగా బోధిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా పాఠశాలకు కావలసిన స్థలాన్ని కేటాయిస్తామని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మండల తాసిల్దార్ పాల్గొన్నారు.

## జెసి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన నాగార్జునరెడ్డి, పివి రవీంద్రలు

తాడిపత్రిటౌన్, నవంబర్ 29 ప్రభాతవార్త



జె.సి.తో నాగార్జునరెడ్డి, పివి రవీంద్రలు

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి భుజానికి జర్మనీలో శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తమ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయంతెలుసుకున్న సౌభాగ్య సింధూ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు పివి రవీంద్ర, రాయలసీమ ఉద్యమకారులు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, పుట్లూరు బాస్కర్‌రెడ్డిలు హైదరాబాద్‌కు వెళ్లి జె.సి ప్రభాకర్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి పెళ్లిరోజు కావడంతో వారు ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే మండల సర్వ సభ్య సమావేశం

- ఎంపిపి యోగేశ్వరి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి యోగేశ్వరి



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

శింగనమల, నవంబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి యోగేశ్వరి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి యోగేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలలో స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కచ్చితంగా ప్రాధాన్యత కల్పించాలని ఆమె పేర్కొన్నారు. ఇటీవల వెలుగు మండల సమాఖ్య అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకునే విషయంపై ఐతమకు సమాచారాన్ని అందించకపోవడంపై ఆమె ఏపిఎం ఈశ్వరయ్యను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో కచ్చితంగా సమాచారం అందిస్తామన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న సంక్షేమ పథకాల అమలు, గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, వైస్ ఎంపిపి నారాయణ, డిప్యూటీ ఎంపిడిఒ విజయభాస్కర్, పిఆర్‌డిఇ జ్యోతి, డిప్యూటీ తహశీల్దారు సురేష్, ఏపిఒ భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్, హార్టికల్చర్ అధికారి శైలజా, పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంఈఓ నరసింహరాజు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, గుమ్మేపల్లి సర్పంచు దేగల లలితమ్మ, వెస్ట్ నర్సాపురం సర్పంచు వెంకటరాముడు, పెరవలి సర్పంచు రాజు, మండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శిలు హాజరయ్యారు.

## జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పులికంటి నాగేంద్రనాథరెడ్డి

అనంతపురం కల్చరల్, నవంబర్ 29 ప్రభాతవార్త



పులికంటి నాగేంద్రనాథరెడ్డికు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పులికంటి నాగేంద్రనాథరెడ్డిని ఏకగ్రీవంగా నియమిస్తూ ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు శివలు నిర్ణయించారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు మహమ్మద్ రసూల్ ప్రత్యేకంగా నాగేంద్ర రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే రాష్ట్ర నేతలు సుబ్బారావు, శివ, ఐజెయు నేత సోమసుందర్‌కు నాగేంద్రనాథరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## చుక్కలూరులో రైతన్న మీకోసం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

తాడిపత్రిటౌన్, నవంబర్ 29 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం చుక్కలూరు రైతు సేవా కేంద్రంలో శనివారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో వ్యవసాయంను ఎలా లాభసాటిగా మార్చాలో వాటి పద్ధతులు రైతులతో చర్చించడం జరిగింది. అలాగే రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి రైతుకు రైతు ఐడి ఉండాలని అది లేని ఎడల మునుముందు పథకాలు వర్తించవని తెలియచేశారు. అలాగే పంటల పెరుగుదల, వ్యాధులు, పురుగుల సమస్యలు మరియు రైతులకు అందుతున్న వ్యవసాయ సేవల గురించి తెలియచేశారు. పంటల స్థితి, ఎరువుల సరఫరా, కనిష్ట మద్దతు ధర, రైతు బీమా వంటి అంశాలపై చర్చించారు. అన్నదాత సుఖీభవలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే రైతు భరోసాధికారి మరియు మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, చుక్కలూరు ఎంపిఈఓ శైలజ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడ పోటీలు

గాండ్లపెంట ప్రభాతవార్త నవంబర్ 29

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించింది ఆ సందర్భంగా గాండ్లపెంట మండలంలోని ఉపాధ్యాయులకు క్రీడ పోటీలను శనివారం నాడు నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు క్రికెట్ ను ఆడారు రెండు జట్లుగా విడిపోయి జరిగిన ఈ పోటీలలో రెక్క మాను క్లస్టర్ టీం గాండ్లపెంట క్లస్టర్ టీం పై విజయం సాధించింది ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణా నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రీడలో ఆడడంవల్ల కులాసవంతంగా ఉత్సాహంగా మనసుకు ప్రశాంతతను తీసుకొస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వం అందిస్తున్న పథకాల కరపత్రాలను చూపుతున్న దృశ్యం

తలుపుల,నవంబర్29, ప్రభాతవార్త

మండల పరిధిలోని ఓబులరెడ్డిపల్లి గ్రామం గరికిపల్లిలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఓబుల రెడ్డి పల్లి మాజీ సర్పంచ్ జయరాం ఆధ్వర్యంలో రైతు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమనీ, కూటమి ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం అన్నదాత సుఖీభవ ద్వారా రైతన్న ఖాతాల్లో రెండో విడత జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎప్పుడు రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులు పెట్టుబడి తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికల రూపొందించి రైతన్నలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఇంతవరకు అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాని రైతులు రైతు సేవ కేంద్రాల్లో కానీ, మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. సచివాల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## పౌరహక్కులపై అవగాహన

తనకల్లు, నవంబర్ 29 ప్రభాతవార్త



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న చెరుకూరు గంగులయ్య

తనకల్లు మండల హెడ్ క్వార్టర్స్ లోని ఎస్‌సి కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం తహశీల్దార్ షాబుద్దీన్, జిల్లా డివిఎంసి మరియు హెచ్‌ఆర్‌సిసిఐ చైర్మన్ చెరుకూరి గంగులయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకూరి గంగులయ్య మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకోవాలని, పిల్లల చదివే మీ ఆస్తి బాల్యవివాహాలు చేయకూడదని, మద్యపానం ఎవ్వరు కూడా సేవించకూడదని, మీ సమస్యలు, భూ సమస్యలు, తదితర సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన తెలియచేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని, సమాజంలో అందరితో పాటు ఎదగాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, వీఆర్‌ఓలు హబీబుల్లా, మొద్దీన్, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతరకు ఎమ్మెల్యే విరాళం

తలుపుల,నవంబర్29, ప్రభాతవార్త



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని వేపమనిపేట పంచాయతీలో గల గంజి వారి పల్లి గ్రామం ఎస్సీ కాలనీ వాసులు నిర్వహించుకునే నడవీధి గంగమ్మ జాతరకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ 50 వేలు విరాళం అందజేసినట్లు మండల కన్వీనర్ ముబారక్ తెలిపారు. నగదును శనివారం గ్రామస్తులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మాజీ కమిటీ చైర్మన్ భార్గవ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, బూత్ కన్వీనర్ అక్బర్, నాగేంద్ర,ముస్తఫా,ఆదిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నో బ్యాగ్ డే

- ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల వేషధారణలు



వేషదారణలో చిన్నారులు

అమడగూరు, నవంబర్ 29 ప్రభాతవార్త

అమడగూరు మండలం ఏ.రెడ్డివారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు రోజా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి శనివారం పిల్లలు మానసిక ఉత్సాహం మరియు విద్యార్థుల తల్లిదండ్రులను వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా చేయడానికి నో బ్యాగ్ డే ను జరుపుకోవాలన్న ఆదేశానుసారం విద్యార్థులు శ్రీరాముడు, సరస్వతిదేవి, రైతు, దుర్గాదేవి, మీరాబాయి, శ్రీకృష్ణుడు, గోపికలు, శ్రీషిర్డీసాయిబాబా, అల్లూరి సీతారామరాజు, ఆంజనేయస్వామి, డాక్టర్, పోలీస్, భీముడు, ఉపాధ్యాయురాలు వేషధారణలతో ఆకట్టుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పేట గగన్ (శ్రీరాముడు), రెండవ బహుమతి నేహా సాయిప్రీతి (దుర్గాదేవి), మూడవ బహుమతి నిత్య (సరస్వతిదేవి), అదేవిధంగా ప్రతి విద్యార్థికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజా, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మనోభావాలు దెబ్బతీయకుండా పరిష్కరిస్తాం

శాసనసభ్యులు కందికుంట

గాండ్లపెంట ప్రభాతవార్త నవంబర్ 29

గాండ్లపెంట మండలం కటారపల్లి పంచాయతీలోని ముద్దన్న గారి పల్లి వద్ద పురాతనమైన కంబాల లక్ష్మీ నరసింహ స్వామి ధ్వజస్తంభము ఉన్నచోట దేవాలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు సంకల్పించడంతో ద్వారము చుట్టుపక్కల కొన్ని సమాధులు ఉన్నందున బాధితులు ఎవరైనా మరిస్తే మేము ఎక్కడ ఖననం చేసుకోవాలని కాబట్టి ఇక్కడే కారణం చేసుకుంటావని చెప్పడం ద్వారా సమస్య ఎదురయింది అయితే ఆ ప్రదేశాన్ని శాసనసభ్యులు పరిశీలించిన తర్వాత గతంలో దేవుని కార్యక్రమాలు చేసే ప్రాంతం కావడం వల్ల అదే విధంగా తెలిసో తెలియకో కొన్ని సమాధులు కొన్ని వెయ్యడం వలన ఈ సమస్య మనోభావాలకు సంబంధించినది కాబట్టి ఏ ఒక్కరివి అనుభవాలు దెబ్బ తినకుండా పరిష్కరిస్తామంటూ తెలియజేశారు అదేవిధంగా మండల తాసిల్దార్ గారికి ఆ ప్రదేశానికి సంబంధించి ఇవ్వాలని ఆదేశించారు

## వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ

తాడిపత్రిటౌన్, నవంబర్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడిపత్రి పట్టణంలోని 13వ వార్డులో వృద్ధులు, దివ్యాంగులకు శనివారం రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎం.రంగనాథ్‌రెడ్డి సిఎస్‌డిటి మల్లేష్ పాల్గొన్నారు.



బియ్యం అందచేస్తున్న దృశ్యం ←

## రైతన్నా మీకోసంను సద్వినియోగం చేసుకోండి

- ఏఓ ఇలియాజ్ అహ్మద్



రైతులకు అవగాహన కలిగిస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, నవంబర్ 29, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతన్నా మీకోసం కార్యక్రమం రూపొందించిందని వ్యవసాయ శాఖ వారు ఇచ్చే అమూల్యమైన సూచనలు పాటించి పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని ఏఓ ఇలియాజ్ అహ్మద్ రైతులకు తెలియచేశారు. శనివారం మండల పరిధిలోని డబురువారిపల్లి పంచాయితీ పరిధిలోని గ్రామాలలో రైతన్నా మీకోసం కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో సాంకేతికత, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు, పాడి రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సలహాలు ఇచ్చి అండగా ఉంటుందన్నారు. వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్దతులు పాటిస్తూ యాంత్రీకరణ ఉపయోగించి సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లి రైతు రెట్టింపు ఆదాయం పొందుతారన్నారు. అదే విధంగా మిట్టపల్లి రైతుసేవా కేంద్రం పరిధిలోని మాల్లాపల్లిలో రైతును రాజును చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని టిడిపి నాయకులు బూదిలి సాంబశివారెడ్డి అన్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ 20 వేలు జమచేశామన్నారు. యూరియా, సబ్సిడీ వేరుశనగ, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉలవలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది అనీల్ కుమార్, రమణ, నాయకులు వెంకటరమణ, మల్లికార్జున, సూర్యనాయణ, శివయ్య, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ టైక్వాండో ఛాంపియన్ షిప్స్ పోటీలలో మూడవ బహుమతి సాధించిన కార్యదర్శి సురేంద్ర



పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ను అభినందిస్తున్న అధికారులు

అనంతపురం రూరల్, నవంబర్ 29 ప్రభాతవార్త

జాతీయ టైక్వాండో పోటీలలో అనంతరం రూరల్ మండలం కొడిమి గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొని మూడవ బహుమతి సాధించడంతో ఆయనను జిల్లా పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారి, మండల డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి, తోటి పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. 41వ సీనియర్ క్యోరుగు, 14వ సీనియర్ పూమ్సే, 8వ కేడెట్ క్యోరుగు పూమ్సే అధికారిక నేషనల్ టైక్వాండో ఛాంపియన్‌షిప్స్ - 2025 నవంబర్ 21 నుండి 23 వరకు ఉత్తరప్రదేశ్ బరేలి లో విజయవంతంగాపూర్తయ్యాయి. ఈ ప్రతిష్టాత్మక జాతీయ పోటీలను ఉత్తరప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ రెగడ్ మరియుబరేలి డిస్టిక్ తైక్వాండో అసోసియేషన్ రెగడ్నిర్వహించాయి. అనంతపురం జిల్లా అధికారుల అభినందనలుఈ ఛాంపియన్‌షిప్‌లో మన జిల్లాను ప్రతినిధిలా నిలబెట్టి నసి. సురేంద్రసీనియర్ పూమ్సే మిక్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన సందర్భంగా, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, అనంత పురం రూరల్ మండలం అభివృద్ధి అధికారి దివాకర్, డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి వెంకట నాయుడు, వివిధ మండలాల డిప్యూటీ మండల అభివృద్ధి అధికారులు, తోటి పంచాయితీ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ను హృదయపూర్వకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ సురేంద్ర సాధన అనంతపురం జిల్లా గర్వకారణం అవుతుందనిభవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు తెచ్చే సామర్థం ఉన్న క్రీడాకారుడని వారు తెలిపారు. అనంతరం వారు సురేంద్రకు శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిప్యూటీ మండల అభివృద్ధి అధికారులు అశోక్ బాబు, దామోదర్ రెడ్డి, హిదయతుల్లా, కామారపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు నవంబర్: 29 ప్రభాతవార్త



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మండల పరిధిలోని వెలసి ఉన్న శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం నందు ధర్మాదాయ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు విశ్వనాథ, సాయి కిరణ్, ఉదయ అనంతరం గంధం కుంకుమ చందన పాలాభిషేకాలు. నిర్వహించారు భక్తులు కోరిన కోర్కెలుతో కొలువైన దేవుడుకు తమల పాకులతో పూజలతో మొక్కుబడులు తీర్చుకున్నారు భక్తుల స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## కల్లు గీత కార్మికుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

నల్లచెరువు నవంబర్:29 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు ఆంజనేయులు గత వారంలో గ్రామంలో ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదం వశాత్తు అదుపుతప్పి చెట్టు పై నుండి కింద పడి గాయపడ్డాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ గాయపడిన ఆంజనేయులు కు రూ. 50 వేలు ఆర్థిక సాయం శనివారం స్థానిక నాయకుల ద్వారా అందజేశాడు. ఈ కార్యక్రమంలో.. టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్,. చంద్రశేఖర్ రెడ్డి , క్లస్టర్ ఇంచార్జ్ గుత్తా ప్రసాద్, సతీష్ నాయుడు, నీలివాండ్లపల్లి నాగరాజు, దేవేంద్ర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమడగూరు, నవంబర్ 29 ప్రభాతవార్త

అమడగూరు మండలం చీకిరేవులపల్లి గ్రామంలోని రామాలయం వద్ద శనివారం స్థానిక తహశీల్దార్ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. పోలీస్ సిబ్బంది గ్రామంలోని వివిధ సమస్యలపై అవగాహన సదస్సు కల్పించారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్క ఎస్‌సి, ఎస్‌టి కులాల వారికి వారి వీధి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోదామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీలర్ ఆదినారాయణ, గ్రామ పెద్దలు రాజు, భాస్కర్‌రెడ్డి, కాసుల శంకరప్ప, రమణ, కదిరప్ప, రమేష్, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం

**-స్వామివారికి ఆకుపూజలు జరిపించిన భక్తులు**

ఉరవకొండ, నవంబర్ 29 ప్రభాతవార్త


లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర శుద్ధ నవమి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆకు పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగళి మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో హక్కులు, చట్టాలపై అవగాహన

అగళి, నవంబర్ 29 ప్రభాతవార్త


అవగాహన కల్పిస్తున్న జడ్పిటిసి, తహశీల్దారు

అగళి ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరులకు హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. మనుషుల మధ్య వివక్ష ఉండకూడదని, మనుషులంతా ఒక్కటేనని, అందరి శరీరాల్లోనూ పారేది ఎర్రరక్తమని, కులానికొక రక్తం ఉండదని మనుషులంతా సమానమని రెండు గ్లాసుల పద్ధతి అవసరం లేదని, హక్కులు బాధ్యతలు తెలుసుకుని ప్రజలు మెలగాలని తహశీల్దారు సుబ్బారావు, ఎంపిడిఓ గంగాధర్, జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లక్ష్మమ్మ, సీనియర్ సహాయకులు గుర్రన్న, భూతరాజు, పోలీసులు పాల్గొన్నారు.

## క్రీడలలో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

రామగిరి, నవంబర్ 29 ప్రభాతవార్త


బహుమతులు పొందిన దివ్యాంగ విద్యార్థులు

మండలంలోని పేరూరు ఉన్నతపాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు క్రీడలలో ప్రత్యేక ప్రతిభ కనబర్చి బహుమతులు పొందారు. కొత్తచెరువులోని సమగ్ర శిక్ష తారా స్పోర్ట్స్ అసోషియేషన్ వారు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీలలో పేరూరు ఉన్నత పాఠశాలకు చెంది అండర్-17 400 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో అక్షయ మొదటి స్థానం సాధించింది. అదే విధంగా అండర్-17షాట్‌పుట్ బాలికల విభాగంలో అక్షయ తృతియస్థానం సాధించింది. అలాగే అండర్-17 100 మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతి చదువుతున్న నిఖిల్ ప్రథమస్థానంలో నిలిచారు. జిల్లా స్థాయిలో బహుమతులు పొందిన వీరిని పాఠశాల హెచ్‌ఎం అరవిందు, దివ్యాంగ విద్యార్థుల కోసం పని చేస్తున్న రవికుమార్‌లు అభినందించారు. దివ్యాంగ విద్యార్థులు అందరితో సమానంగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇలాంటి పోటీలు నిర్వహజంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిలు వారాది, నరేష్‌లు పాల్గొన్నారు.

## నేడు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పై నిరసన కార్యక్రమం

అమరాపురం నవంబర్ 29 ప్రభాతవార్త

అమరాపురంమండల పరిధిలో పేలుబండ గ్రామం నందు ఆదివారం ఉదయం 10 గంటలకు వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మడకశిర వైకాపా సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలకప్ప నాయకత్వంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్తన్న, మాజీ సర్పంచ్ ప్రసాద్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రస్థాయి నాయకులు, నియోజకవర్గస్థాయి నాయకులు, వైకాపా మండల స్థాయి మరియు ఎస్సీ ఎస్టీ బీసీ అనుబంధ విభాగం అధ్యక్షులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు మాజీ సర్పంచులు మండల కమిటీ సభ్యులు, పంచాయితీ కన్వీనర్లు పంచాయతీ ఇంచార్జిలు మాజీ ఫీల్డ్‌అసిస్టెంట్లు, వైకాపా నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వజ్రకరూరు నవంబర్ 29 ప్రభాతవార్త


మృత దేహాన్నిపరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగ స్వామి

మండలంలోని రాగులపాడు పంప్ హౌస్ వద్ద శనివారం ఉదయం పది గంటల ప్రాంతంలో కాలువ నీటిలో కొట్టుకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం లభ్యమైనట్లు ఎస్ ఐ నాగ స్వామి తెలిపారు. మృతుడు సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. ఎరుపు రంగు డిజైన్ గల ఫుల్ షర్టు, గ్రీన్ కలర్ ప్యాంటు, మిల్ మేడ్ గ్రీన్ కలర్ ప్రొమిక్స్ డ్రాయర్ ను ధరించి ఉన్నాడన్నారు. కుడి చేతి పైన ఇంగ్లీషులో పి. సునీతఅను పేరు గల పచ్చబొట్టు, ఎడమ చేతి పైన మూడు చుక్కల పచ్చబొట్టు కలదని ఎవరైనా పై ఆనవాలు గల వ్యక్తిని గుర్తుపట్టిన వెంటనే క్రింది ఫోన్ నెంబర్ లకు తెలపగలరు. వజ్రకరూరు ఎస్సై, 944090 1867 . ఊర్వకొండ రూరల్ సర్కిల్ సిఐ 9440796856. ఊర్వకొండ యుపిఎస్ 9490108514. గుంతకల్లు ఎస్‌డిపిఓ 9440796828కు సమాచారం అందించాలని తెలిపారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గుమ్మఘట్ట నవంబర్ 29 ప్రభాతవార్త



సివిల్ రైట్స్ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట మండలం దేవరెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీకాలనీ ఆర్‌డిటి పాఠశాల యందు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంనకు మండల తాహశీల్దార్ పి రజాక్ వలి మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. జయరాములు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈశ్వరయ్య హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు ఎస్సీ కాలనీ యందు ప్రజలకు విద్య వైద్యము మరియు వారి యొక్క హక్కులు గురించి బాల్య వివాహాలు నిషేధం గురించి అవగాహన కల్పించారు.

## రైల్వే కస్టమర్స్ సమావేశం.. డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా..

గుంతకల్ రైల్వే నవంబర్ 29. ప్రభాతవార్త


సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజెంట్ లో మాట్లాడుతున్న చంద్రశేఖర్ గుప్తా..

గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర శేఖర్ గుప్తా మరియు సీనియర్ డి వో యం శ్రావణ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిమెంట్ ఫ్యాక్టరీ కస్టమర్ల సమావేశాన్ని నిర్వహించారు. బిదిగిలలో జరుగుతున్న పనుల ప్రస్తుత స్థితిని సమీక్షించారు శ్రీ జయజ్యోతి సిమెంట్స్, బనగానపల్లి తిశి॥ది, కృష్ణపురం జనకీ కార్పొరేషన్ లిమిటెడ్, విరాపూర్ తిదిది సిమెంట్స్, సుగుణ స్టీల్స్, జుటు ర్ అన్ని సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుత పనుల పురోగతిని చర్చించి, మిగిలిన కార్యాచరణలను వేగవంతం చేసి కమిషనింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్ని స్టాక్ క్‌హోల్డర్లను సూచించారు.

## డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినం

**ర్యాలీని విజయవంతం చేయండి డా. ఫిరోజా బేగం**

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబర్ 29 ప్రభాతవార్త:


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఫైరోజా బేగం

డిసెంబర్ 1 ఎయిడ్స్ దినం సందర్భంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ డిసెంబర్ 1 తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినంగా జరుపుకోవడం 1988 నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి తో పోరాడిన వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరిని హెచ్ఐవి ఎయిడ్స్ పై పోరాటంలో భాగస్వాములను చేయడానికి ఇది ఉపకరిస్తుందని తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అనేక అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకు ర్యాలీ జరుగుతుందని వై జంక్షన్ లో మనోహరం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞతో ర్యాలీ ముగుస్తుంది అన్నారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ప్రధాన నగరాలలో వైద్య సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నాయని తెలియజేశారు. జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి తగ్గుముఖం పడుతోందని అందుకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి అన్నారు. జిల్లాలో హెచ్ఐవి పై జరుగుతున్న అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ జిల్లాగా అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును రాష్ట్ర రాజధానిలో వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు ద్వారా డిసెంబరు ఒకటిన అందుకోనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలియజేశారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాలను దూరం చేసుకోండి

బత్తలపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త


పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి పుష్పలత

ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాలను దూరం చేసుకోవాలని, అదేవిధంగా బలమైన పోషకాహారం తీసుకోవాలని విద్యార్థులకు ధర్మవరం మండలం దర్శినమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పుష్పలత పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిభా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చికిత్సలు అందించి వారికి మందులు ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం గురించి విశదీకరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు ధరిచేరవన్నారు. అదేవిధంగా పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా బలంగా ఉంటారన్నారు. పాఠశాలలో వంటకాలను, బాతురూమ్లను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ ఉందా, అది సక్రమంగా పని చేస్తోందా అని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సాంబశివమ్మ. హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 16 మంది టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ జట్టుకు ఎంపిక

**-పాల్గొన్న డిప్యూటీ డిఈఓ జాన్‌రెడ్డప్ప, మండల విద్యాశాఖ అధికారి గోపాల్**

**-గోరంట్ల మండలం నుంచి 18 మంది ఎంపిక**

గోరంట్ల, నవంబర్ 29 ప్రభాతవార్త


ఎంపికైన ఉపాధ్యాయ క్రీడాకారుల జట్టు

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పురుష ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గోరంట్ల మండలం క్రికెట్ టీం సెలక్షన్స్‌ను శనివారం పెనుకొండ డిప్యూటీ డిఈఓ జాన్‌రెడ్డప్ప, మండల విద్యాశాఖ అధికారి గోపాల్ సమక్షంలో నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ నిబంధనల మేరకు కెప్టెన్‌గా ఒక హెడ్మాస్టర్ లేదా ఎంఈఓ, నలుగురు సబ్జెక్ట ఉపాధ్యాయులు, నలుగురు భాషోపాధ్యాయులు, ఒక పిడి, ఆరుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను (మొత్తం 16 మందిని) ఎంపిక చేయాలి. సెలెక్ట్ అయిన మండల టీములు డిసెంబరు 13, 14 తేదీలలో డివిజనల్ స్థాయిలో పోటీ పడటం జరుగుతుంది. ఈ రోజు గోరంట్ల మండలంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో ఎంపిక కాబడిన టీం సభ్యులను ప్రకటించడం జరిగింది. టీం కెప్టెన్‌గా జెడ్‌పిహెచ్‌ఎస్ వానవోలు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సబ్జెక్ట ఉపాధ్యాయులుగా నీలం అశోక్, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, నాగరాజు, భాషోపాధ్యాయులుగా రాధా రమణ, సాయినాథ్, ప్రకాష్‌రెడ్డి, ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులుగా గంగరాజు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా విజయ్, బాలు, హనుమంతు, రమేష్‌రెడ్డి, సిరాజుద్దీన్, సాయిమహేష్‌లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, నాగరాజు, రేఖ, సుభాష్‌నాయక్, నరేష్, బాషా, సత్యనారాయణరెడ్డి, ఓబుళపతి, అజీజ్‌బాషా, నాగేంద్ర, రవీంద్ర, ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవారికి ఉచిత వైద్యం సకాలంలో అందాలి....

**- ప్రజలను నిరక్ష్యం చేస్తే చర్యలకు వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదు... -ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు...**


ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ నవంబర్ 29 ప్రభాతవార్త.

మడకశిర నియోజకవర్గంలోని పేదవారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా, సకాలంలో అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మడకశిర పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు దిశానిర్దేశం చేశారు. మడకశిర పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పాల్గొన్నారు. శనివారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ: ఆసుపత్రిలో పేద ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు సంబంధించిన వివరాలు, అందుతున్న వైద్యం, ఓపీ వివరాలతో పాటు సంబంధిత రికార్డులను సైతం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే మెరుగైన వైద్యం సకాలంలో అందుతుందన్న నమ్మకాన్ని సిబ్బంది కల్పించేలా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మంచి అభిప్రాయం రావాలని, ప్రతి పేదవారికి ప్రభుత్వ ఆసుపత్రులు అండగా నిలబడతాయనే భరోసాను కల్పించాలని సూచించారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేసే పరిస్థితి ఉండదని, తప్పు చేసిన వారిని ఉపేక్షించే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## గేట్స్‌లో స్కిల్స్ బిల్డ్ క్లౌడ్ శిక్షణ


విద్యార్థులు హాజరైన దృశ్యం

గుత్తి, నవంబర్ 29 ప్రభాతవార్త

మారుతున్న ఆధునిక సమాజంలో విద్యార్థులు తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఐసిటి అకాడమీ అధికారి ప్రవీణ్, కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డిలు సూచించారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ విద్యార్థులకు ఐబిఎం మరియు స్కిల్స్ బిల్డ్, ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో ఐబిఎం స్కిల్స్ బిల్డ్ ఆన్ క్లౌడ్ అన్న అంశంపై నాలుగు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్‌సుధాకర్, పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, ఏఓ ఇంతియాజ్‌బాషా, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, పాల్గొన్నారు.

## వీరాపురం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం

చిలమత్తూరు, నవంబర్ 29 ప్రభాతవార్త


పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామ పెద్దల సమక్షంలో పౌరుల యొక్క హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. అలాగే సమాజంలో వ్యవహరించాల్సిన తీరు గురించి, చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఉరవకొండ ప్రధాన రహదారిలో కొనసాగిన ఆక్రమణల తొలగింపులు..!

**-సమయమిచ్చినా వ్యాపారుల్లో స్పందన లేకపోవడంతో అధికారుల చర్యలు -దగ్గరుండి పర్యవేక్షించిన ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి**

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త


ఉరవకొండలోని ప్రధాన రహదారి ఆక్రమణలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

ఉరవకొండ పట్టణంలోని ప్రధాన రహదా రికి ఇరుప్రక్కల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం కొనసా గింది. ఇదివరకే ఎస్.కె.ఉన్నత పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకొని వేసుకున్న తాత్కాలిక షెడ్లను తొలగించిన విషయం తెలిసింది. ఇటువైపున శాశ్విత వ్యాపార సముదాయాల ముందు రోడ్లను


ఆక్రమణలకు వినియోగించిన వస్తువులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

ఆక్రమించుకొని ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లు, కట్టడాలను స్వతహాగా తొలగించుకోవడానికి వ్యాపారులకు అధికారులు వారం రోజులు గడువు ఇచ్చారు. అయితే అనేక మందిలో స్పందన లేకపోవడంతో ఎంపీడీవో బి.వి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో పి.సతీష్‌బాబు, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్‌దగ్గరుండి పంచాయతీ కార్మికులతో ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన మురుగు కాలువపై కూడా అక్రమణలు ఉండటంతో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించడంపై సర్వత్రాహర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఆక్రమణలు తొలగిస్తూనే మళ్లీఎవరైనా ముందుకొచ్చి ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అక్రమణల కారణంగా ప్రధాన రోడ్డు కుచించుకొనిపోయి వాహన రాకపోకలకు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో దాదాపు పక్షం రోజులుగా అధికారులు ఆక్రమణల తొలగింపులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

## సంరక్షణ, పోషణ, ఆటల ద్వారా విద్య...ఇదే అంగన్‌వాడి సెంటర్ లక్ష్యం

**-గోరంట్లలోని రెండు అంగన్‌వాడి సెంటర్లలో...ఈసీసీఈ డే కార్యక్రమాలు**

**-పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్యం నింపిన...సూపర్‌వైజర్ నాగరాణి**


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

గోరంట్ల, నవంబర్ 29 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ డాక్టర్ శాంతలక్ష్మి ఆదేశాల మేరకు గోరంట్ల మండలంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ఈసీసీఈ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీ, ఎస్‌సి కాలనీ, శివాలయం వీధి అంగన్‌వాడి కేంద్రాల్లో ఈసీసీఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ శిశు సంరక్షణ మరియు ప్రారంభ విద్య దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సంరక్షణ, పోషణ, పాటల ద్వారా విద్య ఈ లక్ష్యంపై మండలంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ-స్కూల్ యాక్టివిటీస్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఘనంగా ఈసీసీఈ డే నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో చిత్రలేఖనం, పాటలు, కథలు, అక్షరాల అభ్యాసం, ఆటల ద్వారా విద్య వంటి ప్రీ-స్కూల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ చిన్న పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రీ-స్కూల్ విద్య పునాది వంటిదని, అంగన్‌వాడి కేంద్రాలలో అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో బుద్ధి వికాసం, భాషా నైపుణ్యం, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. తల్లులు ఇంటి వద్ద కూడా పిల్లలకు కథలు చెప్పడం, చిత్రలేఖనం నేర్పించడం, అక్షరాల అభ్యాసం చేయించడం ద్వారా ప్రీ-స్కూల్ విద్యకు తోడ్పాటు అందించాలని సూచించారు. తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు మంజుల, లక్ష్మీయనరసమ్మ, నూర్జహాన్, సహాయకులు జయబాయి, జానకి, శ్రీనివాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం

కంబదూరు, నవంబర్ 29, ప్రభాతవార్త


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బాలకిషన్

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ బాలకిషన్ అన్నారు. శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా కంబదూరు మండల పరిధిలోని పాళ్ళూరు గ్రామంలో అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగిన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో ప్రజలంతా కలిసిమెలిసి సామరస్యంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ రెవెన్యూ అధికారి సంజీవరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు


త్రోబాల్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

గుంతకల్లు, నవంబర్ 29 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్‌జెపి హైస్కూల్‌లో శనివారం మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, మండల ఎస్‌జిఎఫ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిరివరం అంబేద్కర్ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం

లేపాక్షి, నవంబర్ 29 ప్రభాతవార్త



పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న దృశ్యం

మండల పరిధిలోని సిరివరం అంబేద్కర్ కాలనీలో శనివారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకతీతంగా ఉంటూ సోదర భావంతో కలిసిమెలిసి మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహమూర్తి, సర్పంచు నేత్రావతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భారతదేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనది

**పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో మాతృమూర్తులే తొలి గురువు**

**సప్తశక్తి సంఘం సమావేశంలో మాతృమూర్తులు**

కళ్యాణదుర్గం, నవంబర్ 29 ప్రభాతవార్త


మాతృమూర్తుల సమావేశంలో ప్రసంగిస్తున్న మహిళలు

భారత దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అమూల్యం, అపారమని, దేశం ప్రగతిపథంలో నడవడానికి మహిళలు ప్రతి రంగంలోనూ ప్రతిభను, నైతికశక్తిని అందిస్తున్నారని స్త్రీ శక్తి సాధించలేనిది ఏదిలేదని విశ్రాంత ఉపాధ్యాయిని జ్యోతి అన్నారు. శనివారం స్థానిక గీత మందిరంలో సప్తశక్తి సంఘం ( మాతృమూర్తుల) సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సరస్వతి విద్యా మందిరం ప్రధానాచార్యులు కరణం తిరుమల రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు శ్రీమతి జ్యోతి మాట్లాడుతూ మహిళ కుటుంబానికి హృదయమని, పిల్లలకు విలువలు, విద్యాబుద్ధులు నేర్పి మంచి పౌరులను తయారుచేసే సమాజానికి అందించే బాధ్యత స్త్రీలదేనని అన్నారు. హోమియో వైద్యురాలు సాయి రమ్య మాట్లాడుతూ శాంతి, ప్రేమ, శ్రద్ధతో కుటుంబాన్ని సమతుల్యం చేస్తూ, కుటుంబం పట్ల బాధ్యత కారణంగా స్త్రీలు ఆరోగ్యాని నిర్లక్ష్యం చేస్తుంటారని, స్త్రీలు సమయాన్ని కేటాయించుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో లీలావతి, మంజుల, నర్మదా, లీలావతి, అనురాధ మాతాజీలు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన లేమి, దుర్వ్యసనాలతోనే పిల్లలపై లైంగిక దాడులు

-అసంక్రమిత వ్యాధుల కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి

-పిల్లలపై లైంగిక దాడుల నిరోధం, ప్రారంభ బాల్య అభివృద్ధిపై మండలస్థాయి శిక్షణ





శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న అసంక్రమిత వ్యాధుల కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, శిక్షణకు హాజరైన వారు

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త

చట్టాలపై అవగాహన లేమి దుర్వ్యసనాలతోనే పిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని అసంక్రమిత వ్యాధుల కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పిల్లలపై లైంగిక దాడుల నిరోధం, ప్రారంభ బాల్య అభివృద్ధిపై మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జి.నారాయణ స్వామి మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులను నివారించడానికి ఉన్నత పాఠశాలస్థాయి పాఠ్యపుస్తకాల్లో ఈ చట్టాలను చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించనచో లైంగిక దాడుల నుంచి బాల్యాన్ని రక్షించుకోవచ్చన్నారు. ప్రతిశాఖ ప్రతి అధికారి కలిసి పనిచేస్తేనే పిల్లలపై లైంగిక దాడులను అరికట్టి వారిని భద్రపర్చి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలమన్నారు. శిక్షణలో జిల్లా త్వరిత చికిత్స కేంద్రానికి చెందిన పిల్లల మనోవైద్య నిపుణులు, జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలో ప్రత్యేక శిక్షణ పొందిన ప్రధాన శిక్షకులు సుందరరావు సిరిగిరి సులభంగా, స్పష్టంగా పీపీటీ ద్వారా దృశ్యాలను చూపిస్తూ చక్కగా వివరించారు. శిక్షణలో పిల్లలపై లైంగిక దాడి, నిర్వచనం, అపోహలు, రకాలు, స్థానిక ఘటనలు, ఫోక్సో చట్టం, జేజే చట్టం, బాల్య ట్రామా అనుభవం, దాని ప్రభావం, ఆన్‌లైన్ గ్రూమింగ్, ఆఫ్‌లైన్ గ్రూమింగ్, పిల్లలపై లైంగిక దాడిని చెప్పే విధానం, ఆసమయంలో కనిపించే సంతేకాలు, దశలు, మహిళా బాలల సంక్షేమ విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్‌శాఖ, స్వచ్ఛంధ సంస్థల బాధ్యతలు, విభాగాల వారిగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, సమన్వయ ప్రణాళిక రూపొందించడం, ప్రారంభ బాల్య అభివృద్ధి తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్‌నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ లక్ష్మీచందన, డాక్టర్ పద్మ, డాక్టర్ జయకుమార్, డాక్టర్ రఫియా సుల్తానా, డాక్టర్ పుష్ప, ఉరవకొండ కమ్యూనిటీ ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ సాహితి, ఎంపీడీవో బి.వి.రవికుమార్, ఎంఈవో హెచ్.ఈశ్వరప్ప, ఏఎస్ఐ స్టాండ్లీ పాల్, అదనపు సీడీపీవో ఎల్లమ్మ, డీఈఐసీకు చెందిన మేనేజర్ రజిత, ఫిజియోథెరపిస్టు దరిష, ఎర్లీ ఇంటర్వెంషనిస్టు చంద్రకళ, సోషల్ వర్కర్ రాజేశ్వరి, సీహెచ్‌వోలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళమ్మ దేవాలయంలో లక్ష దీపోత్సవం





కాళమ్మదేవతను అలంకరించిన దృశ్యం, దీపాలు వెలిగించిన దృశ్యం

అగళి, నవంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళి కాళమ్మదేవాలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో, ఆభరణాలతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళా భక్తులు ఆలయంలోపల ఆవరణలో దీపాలను వెలిగించారు. దేవాలయం చుట్టూ ముగ్గులు వేసి మామిడి అరటి తోరణాలతో, పూలతో అలంకరించారు. దీపాలు వెలిగించి పసుపు, కుంకుమలతోపాటు దీపానికి పూలు అగరబత్తిలతో పూజించారు. దీపం మంగళకరమని దీపం చీకటిని తొలగించిజ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, దీపం వెలిగించడం మూలంగా ఐశ్వర్యం సిద్దిస్తుందని, జ్ఞానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అభిషేకాలు, మహా మంగళ హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

## ఏ ఉద్యోగికైనా మానసిక ప్రశాంతతకై క్రీడలు ఎంతో అవసరం

-ఉపాధ్యాయుల క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ -డివిజినల్ స్థాయి క్రీడా పోటీలకు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల ఎంపిక



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న పురుష ఉపాధాయులు

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త

ఏ ఉద్యోగికైనా మానసిక ప్రశాంతతకై క్రీడలు ఎంతో అవసరమని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం మండలస్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు, ఎంపిక కార్యక్రమం ప్రారంభోత్సవం ఎస్.కె.ఉన్నత పాఠశాల



త్రోబాల్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయినులు

హెచ్ఎం ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన జరుగగా ఎంపీడీవోతోపాటు మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప, ఎంఈవో-2 పి.రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.వి.రవికుమార్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామంతోపాటు తమకు ఆసక్తిగల క్రీడలను ఆడటం మంచి అలవాటన్నారు. అనంతరం పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు జరుగగా వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను డివిజినల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీల కోఆర్డినేటర్ సి.మారుతీప్రసాద్, పీడీలు ప్రవీణ్, కిరణ్, అష్రాఫ్, కాశీ విశ్వనాథ్, మంజునాథ్, నాగేంద్ర, పుల్లా రాఘవేంద్ర, ఈశ్వరి, రుక్మిణి, నాగేంద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంక్ ఏటిఎంను ప్రారంభించిన ట్రైనింగ్‌ఎస్ఐ జి.మహేష్

బెలుగుప్ప, నవంబర్ 29 ప్రభాతవార్త



ఎస్‌బిఐ ఏటీఎం ప్రారంభిస్తున్న ట్రైనింగ్ ఎస్ఐ జి.మహేష్

బెలుగుప్ప మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు ఏటిఎంను శనివారం బ్యాంకు మేనేజర్ సుబ్రమణ్యం, ట్రైనింగ్ ఎస్ఐ జి.మహేష్ నూతన ఏటిఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి ఏటిఎం పని చేయకపోవడంతో కొత్త ఏటిఎంను ఏర్పాటు చేశామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామదాసు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్ముడుపోని ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు

-ధర ఎక్కువ ఉండటంతో వెనుదిరిగిన వేలం పాటదారులు

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త

ఉరవకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషల్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు ఒక్కటి కూడా అమ్ముపోలేదు. రెండు ద్విచక్రవాహనాలతోపాటు ఒక టాటా సుమో అమ్మకానికై శనివారం ఎక్సైజ్ స్టేషన్‌వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి ఆధ్వర్యంలో జరుగగా వాహనాలకు ఎంవీఐ నిర్ణయించిన ధర అధికంగా ఉండటంతో దరావతు చెల్లించి వేలంలో పాల్గొనడానికి పాటదారులెవ్వరూ ముందుకు రాలేదు. ఈ సందర్భంగా స్థానిక ఎక్సైజ్ సీఐ ఆర్.రవిచంద్ర మాట్లాడుతూ వాహనాలకు మరోమారు ఎంవీఐతో ధర నిర్ణయింపజేసిన అనంతరం వేలం నిర్వహిస్తామని వివరించారు.

## అక్రమ మద్యం రవాణా జరుగకుండా నిఘా కొనసాగించండి

-అసిస్టెంట్ ఎక్షైజ్ సూపరింటెండెంట్ రేవతి

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి

సరిహద్దులు దాటి అక్రమ మద్యం జిల్లాలోని ప్రవేశించకుండా నిరంతరం గట్టి నిఘా కొనసాగించాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఏఈఎస్ ఉరవకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసి నేర ఎక్సైజ్ నేరాలపై స్థానిక ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం విడపనకల్లు, డోనేకల్లు సరిహద్దు ఎక్సైజ్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఎస్ రేవతి మాట్లాడుతూ కర్నాటక ప్రాంతం నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్టు అధికారి బ్రహ్మయ్య, ఎస్ఐ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తను పరామర్శించి ధర్మతేజ

బ్రహ్మ సముద్రం నవంబర్ 29 ప్రభాతవార్త



కార్యకర్తను పరామర్శిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పాలవెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్య కర్త నరసింహామూర్తి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుగారి గారిమేనల్లుడుదేవినేని ధర్మ తేజ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ , మండలతెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆటోను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త





ప్రమాదంలో గాయపడిన నాగేంద్ర , ప్రమాదంలో గాయపడిన నాగేంద్రమ్మ

మండల పరిధిలోని మాల్యవంతం సమీపంలో శనివారం ముందు వెలుతున్న ఆటోను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొనడంతో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆనంతసాగరం గ్రామానికి చెందిన గుజ్జల నాగేంద్రయ్య, నాగేంద్రమ్మ దంపతులు కూరగాయలను ఆటోలో వేసుకొని ఊరురా తిరుగుతూ వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం ఆటోలో కూరగాయలు వేసుకొని మాల్యవంతం వైపు వెలుతున్న ఆటోను ధర్మవరం నుంచి పాఠశాల విద్యార్థులను తరలించే ఆర్టీసీ బస్సు మాల్యవంతం సమీపంలో ఆటోను వెనుకవైపు ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్య పరీక్షలు అందుకున్నారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులతో ఆరా తీశారు. ఇదిలా ఉండగా ఇరువురూ రాజీ అయినట్లు సమాచారం. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిసింది.

## అట్టహాసంగా ఉపాధ్యాయుడు ముద్దలాపురం నాగరాజు పదవీ విరమణ

-సేవలను కొనియాడిన ఎంఈవోలు హెచ్.ఈశ్వరప్ప, పి.రమాదేవి



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ముద్దలాపురం నాగరాజు దంపతలను సన్మానిస్తున్న ఎంఈవోలు, తోటి ఉపాధ్యాయులు

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని రేణిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ముద్దలాపురం నాగరాజు పదవీ విరమణ కార్యక్రమం శనివారం పాఠశాలలో అట్టహాసంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాకే భాస్కర్ అధ్యక్షతన జరుగగా మండల విద్యాధికారులు హెచ్.ఈశ్వరప్ప, పి.రమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.హనుమప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ముద్దలాపురం నాగరాజు దంపతులను ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు షాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముద్దలాపురం నాగరాజు 35 సంవత్సరాలపాటు నిబద్ధత, అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దావుద్, లక్ష్మన్న, సునీత, వసంతమ్మ, వరలక్ష్మి, నాగవేణి, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్యదర్శి కరణం వ్యాసరావ్ సేవలు మరువలేనివి ..

పదవీ విరమణ అనంతరం ప్రశాంత జీవితం గడపాలి

ఘనంగా వీడ్కోలు పలికిన సిబ్బంది

శెట్టూరు, నవంబర్ 29 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జిలాన్ భాషా

గ్రామంలోఉద్యోగ రీత్యా ప్రజలతో మమేకమై పని చేస్తే పది కాలాలు వారికి గుర్తుండి పోతామని ఎంపీడీఓ జిలాన్ భాషాఅన్నారు. శనివారం మండలంలోని శెట్టూరు గ్రామ పంచాయితీ కార్యదర్శిగావిధులు నిర్వహిస్తుపదవీ విరమణ పొందిన కరణం వ్యాసరావ్ కు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సభలో సహచర సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఈశ్వరమ్మ వైస్‌ఎంపీపీ చెవులక్రిష్టప్ప ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగాఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడు తూ.. పంచాయితీకార్యదర్శిగా కరణం వ్యాసరావ్ మండల కేంద్రంలో అనేక సేవలు అందించడం గొప్పవిషయం అన్నారు.పనిచేసిన ప్రతీచోట వివాద రహితుడుగా ప్రజలమన్ననలు పొందారన్నారు. అనంతరం పదవీవిరమణ పొందుతున్న కరణంవ్యాసరావ్‌ను తోటిఉద్యోగసిబ్బంది అభిమానులు పూలమాలలు వేసి దుశ్శాలువాలు కప్పిఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండలంలోని నాయకులు అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## గడేకల్లు కొండపైగల ఆలయాలకు విద్యుత్ వెలుగులు..!

-పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు చెబుతున్న గ్రామస్థులు

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త



కొండపై విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో ఉరవ కొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం గడేకల్లు కొండపైగల ఆలయాలు విద్యుత్ వెలుగులను విరజిమ్ముతున్నాయి. గడేకల్లు కొండపై వాయువ్య దిశలో చౌడమ్మ, కొండ పైభాగంలో భీమలింగేశ్వరస్వామి ప్రథమ ఆలయం, సూర్య చంద్రులు, చౌడేశ్వరిదేవి పురాతన ఆలయాలు కొలువై ఉన్నాయి. ఈ ఆలయాలను గ్రామ నుండే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుండి నిత్యం భక్తులు దర్శించుకొని అక్కడే నిద్రలుచేసి దేవరలు నిర్వహిస్తుంటారు. అయితే కొండపై విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కొండపై విద్యుత్ సౌకర్యం ఉంటే ఆలయాలు అభివృద్ధి చెందడమే కాకుండా భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సమస్యను గ్రామస్థులు పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వెంటనే స్పందించి విద్యుత్‌శాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి కొండపైకి 13 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై వెంటనే స్పందించిన పయ్యావుల సోదరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## కల్లుకుంట, బండ్లపల్లి గ్రామాల్లో రైతన్నా మీకోసం

చిలమత్తూరు, నవంబర్ 29 ప్రభాతవార్త



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

హిందూపురం ఎమ్మెల్యే, పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు శనివారం చిలమత్తూరు మండలం పలగలపల్లి పంచాయతీ కల్లుకుంట, బండ్లపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రామునాయక్, కృష్ణయ్య, కవితరాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, ఎమ్మెల్యే పిఏ బాలాజీ, కన్వీనర్ శ్రీనివాస్, గౌరీశంకర్, బేకరి గంగాధర్, బాలాజీ, వైస్ ఎంపిపి బయప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహయ్య, హనుమంతు, రామకృష్ణారెడ్డి, సురేంద్ర, విశ్వనాథ్‌రెడ్డి, చంద్ర, కృష్ణమూర్తి, నాగయ్య, వెంకటేష్, క్రిష్టప్ప, రామచంద్రప్ప, వెంకటశివరెడ్డి, సుబ్బరామప్ప, లక్ష్మీపతి, నవీన్, పెద్ద నరసింహయ్య, భాస్కర్‌రెడ్డి, వేణు, వెంకటాద్రి, శ్రీనివాస్, నాగప్ప, రాము, రఫీ, అంజి, వెంకటేష్, వ్యవసాయశాఖ అధికారులు విద్య, గౌతం, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## యువకునిపై పోక్సో కేసు నమోదు

బత్తలపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త

మైనర్ బాలికను మాయమాటలతో నమ్మించిలో బర్చుకున్న యువకునిపై ఫోక్సో కేసు నమోదు చేసిరిమాండ్కు పంపినట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన ఈడిగ హరీష్ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ, పెళ్లి చేసుకొని బాగా చూసుకుంటాను అని నమ్మించి బాలికను తనతో పిలుచుకొని వెళ్లి బాలికతో శారీరకంగా కలిసి మోసం చేసినాడని జరిగిన విషయం బాలిక తన తండ్రితో చెప్పినట్లు తెలిపారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్మవరం రూరల్ సీఐ విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి యువకుడిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. జడ్జి 14 రోజులు పాటు రిమాండు ఆదేశించినట్లు తెలిపారు.

## సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి..

అధికారులకు మడకశిర ఎమ్మెల్యే ఆదేశం.

మడకశిరలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక పోటెత్తిన ప్రజలు

మడకశిర టౌన్ నవంబర్ 29 ప్రభాతవార్త



ప్రజల నుండి వినతి పత్రాలను తీసుకుంటున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.

మడకశిర నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను అధికారులు సకాలంలో చేపట్టాలని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఆదేశించారు. మడకశిరలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. అర్జీలతో మడకశిరలోని అన్ని మండలాల నుండి ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. తన వద్దకు వచ్చిన ప్రతి అర్జీదారునితో ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఏ శాఖకు సంబంధించిందో తెలుసుకుని సదరు శాఖలోని సంబంధిత అధికారికి తక్షణమే ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇలా ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అక్కడికక్కడే చర్యలు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు.అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం, లాభదాయకం

- లత్తవరం క్షేత్ర పరిశీలనలో ఆర్‌వైఎస్‌ఎస్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ, నవంబరు 29 ప్రభాతవార్త



భూమిలోకి విత్తనం వేస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమే కాకుండా రైతులకు లాభదాయకమని ఏపీ సీఎం ఆఫ్ ఆర్ వైఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలో ని లత్తవరం గ్రామంలో శనివారం ఎనీటైం మనీ ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయం క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపట్ల ఆసక్తికర బరుస్తున్న రైతులకు ఆరోగ్యవంతమైన పంటలను తక్కువ పెట్టుబడితో పండించి అధిక దిగుబడులు సాధించి లాభపడేలా చేయడమే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహిస్తున్నారని రైతులు తగిన సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయగలిగిన పంటల వివరాలను వెల్లడించి భూమిలో పలు రకాల విత్తనాలు వేశారు. అనంతరం వజ్రకరూరు మండలంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంటి ధనుంజయ, ఎస్‌డీప నాగరాజు, ఐసీఆర్‌పీలు తొలిచానాయక్, ఎస్.కె.సుబ్రమణ్యానాయక్, ధాక్యనాయక్, షేక్షావలి, కదిరప్ప, రమేష్, ఎఫ్‌ఎంటీ శిల్పబాయి, రజా, సత్యభామబాయి, డి.తొలిచానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

బెలుగుప్ప, నవంబర్ 29 ప్రభాతవార్త



మాట్లాడుతున్న అధికారులు

బెలుగుప్ప మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సును శనివారం బెలుగుప్ప ఎస్సీ కాలనీలో అంబేద్కర్ కమిటీ భవనంలో తహశీల్దారు అనిల్‌కుమార్, ఎస్ఐ జి.శివ, ఎంపిడిఓ లక్ష్మినారాయణల ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చిన మహిళలకు, పురుషులకు 1989లో ఎస్సీ, ఎస్టీ చట్టాలను తీసుకొచ్చారని వాటిపై వారికి విశ్లేషించి అవగాహన కల్పించారు. రాబోయే తరాల యువతకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి పరిపాలన అధికారి గోపాల్, విఆర్ఓ శ్రావణి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆదేశాలతో క్రీడా పోటీలు

అగళి, నవంబర్ 29 ప్రభాతవార్త



క్రీడా పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1 కృష్ణమూర్తి రాజు, ఎంఈఓ-2చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను అగళి ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు పిడి నారాయణస్వామి తెలిపారు. ఇక్కడ విజేతలైన వారు పెనుకొండ తర్వాత పుట్టపర్తి, ఆ తర్వాత తుది పోరు అమరావతిలో నిర్వహజస్తారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సలహా మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 679 మండలాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంఈఓ కెప్టెన్‌గాను, మిగిలిన సభ్యులను రెండు జట్లుగా విభజించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఇందులో గెలుపొందినటువంటి జట్టును మడకశిరలో జరగబోయే డివిజన్ స్థాయి పోటీల్లో డిసెంబర్ 13, 14 తేదీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రికెట్ విజేతలుగా నారాయణస్వామి, రామాంజినేయులు, శంకరయ్య, ప్రకాష్, మధు, నాగార్జున, రసూల్, నాగరాజు, కుమార్, జీలాన్, భరత్, ప్రశాంత్, సురేష్, మోహన్‌లు ఉన్నారు.

